ఆస్తిపన్ను వసూళ్లపై సమావేశం



ఆస్తిపన్ను వసూళ్లపై బిల్లు కలెక్టర్లతో సమావేశమైన డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను వసూళ్లపై రోజువారి టార్గెట్‌ను బిల్లు కలెక్టర్లు తప్పని సరిగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ సూచించారు. సర్కిల్ పరిధిలోని బిల్లు కలెక్టర్లతో తన కార్యాలయంలో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆస్తిపన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనవరి నెలకు గాను ఆరు కోట్ల టార్గెట్‌ను నిర్ధేశించినట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా రోజువారి టార్గెట్‌ను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ప్రస్తుతం గురువారం వరకు రూ.60 లక్షల ఆస్తిపన్ను మాత్రమే వసూలు చేయడం జరిగిందన్నారు. జనవరి నెలకు సంబంధించి రూ.5.40 కోట్లు వసూలు చేసేది ఉందన్నారు. గురువారం నాటికి సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల నుంచి రూ.32 కోట్ల 50 లక్షలను వసూలు చేశామన్నారు. ఇంకా 20 కోట్ల రూపాయల ఆస్తిపన్నును వసూలు చేయాల్సి ఉందన్నారు.

ప్రతి దరఖాస్తు కంప్యూటరీకరణ



బండ్లగూడలో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలనలో వచ్చిన ప్రతి దరఖాస్తును కంప్యూటరీకరణ చేస్తున్నామని రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీ డి. శంకర్‌సింగ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియను కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్‌చంద్రతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఆయన పలు సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పులు లేకుండా ప్రజా పాలన దరఖాస్తులను ఆన్ లైన్ చేస్తున్నామన్నారు. వీలైనంత త్వరగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ దరఖాస్తుల కంప్యూటరీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి పనులు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వి. వేణుగోపాల్ రెడ్డి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

స్కేటింగ్‌లో రజతం సాధించిన తరుణి



శంషాబాద్: స్కేటింగ్‌లో శంషాబాద్‌కు చెందిన విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభను కనరబర్చారు. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో పదిరోజుల పాటు జరిగిన స్కేటింగ్ పోటీల్లో పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన గడ్డమీది ప్రవీణ్‌కుమార్ కుమార్తె తరుణి, రజత పతకాన్ని సాధించింది. ప్రముఖ స్కేటింగ్ క్రీడాకారుడు సయ్యద్ హుస్సేన్ బాలికకు శిక్షణ ఇచ్చాడు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులతో పాటు స్థానికులు, బ్రూక్ ఫీల్డ్ పాఠశాల యజమాన్యం విద్యార్థిని అభినందించారు.

ఓల్డ్ విలేజీలో చెత్త సమస్య



అత్తాపూర్: పారిశుద్ధ్య నిర్వాహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో ఎక్కడికక్కడ చెత్త చెదారం పేరుకుపోతుంది. అత్తాపూర్ ఓల్డ్ విలేజీలో డంపు చేసిన ప్రాంతాల్లో ఇతరులు లిఫ్ట్ చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేసిన సమస్యకు పరిష్కారం కావడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతూ వస్తున్నాయి సమస్యలు మాత్రం తీరడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



మాట్లాడుతున్న పూలపల్లి కృష్ణారెడ్డి

బండ్లగూడ: తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలోని సంఘమిత్ర స్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకోని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగుతనం ఉట్టిపడేల సంక్రాంతి పండుగకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తలారి ప్రేమ్‌కుమార్, సుధాకర్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుంపులుగా వెళ్తున్న మహిళలు

దాటాలంటే వణుకే..

- రోడ్డు దాటాలంటే కష్టంగా మారింది
- ప్రమాదకరంగా మారిన ప్రధాన రహదారి

మైలార్‌దేవ్‌పల్లి: వాహనాల రద్దీ పెరగడంతో రోడ్డు దాటడం కష్టంగా మారుతుంది. ఏ ప్రధాన రహదారి చూసిన వేగంగా దూసుకొస్తున్న వాహానాలతో నిండిపోతున్నాయి. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రోడ్డు దాటాలంటే జంకుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ వెళ్లే ప్రధాన రహదారిపై ప్రతి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయి. ఈ రహదారి మధ్యలో మార్కండేయ నగర్ కాలనీ, బాబుల్‌రెడ్డినగర్, సాయిబాబానగర్ కాలనీలలో సుమారు 10 నుంచి 20వేల వరకు ప్రజలు నివసిస్తున్నారు. ఎక్కువగా కాటేదాన్ పారిశ్రామిక వాడలో పనిచేసే ప్రజలు ఉన్నారు. అందరు మార్కండేయనగర్ నుంచి ప్రధాన రహదారి దాటి పరిశ్రమలకు వెళ్లాలి. ఎటు నుంచి ఏ వాహనం వేగంగా వస్తుందోనని భయాందోళనలో ప్రజలు గుంపులు గుంపులుగా కలిసి రోడ్డు దాటుతున్నారు. గతంలో అనేక మంది ప్రమాదాల భారిన పడిన సందర్భాలు ఉన్నాయి. మార్కండేయనగర్ ప్రధాన రహదారిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు. రోడ్డు దాటడం కష్టంగా ఉన్నదని గతంలో అనేక మార్లు ట్రాఫిక్ పోలీసులకు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకపోయిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాటేదాన్ ప్రాంతంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. అది నిరుపయోగంగా ఉన్నది. అక్కడి నుంచి ఆ బ్రిడ్జిని తొలగించి మార్కండేయనగర్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేస్తే ఎంతో మందికి మేలు చేసిన వారవుతారని అధికారులను కోరుతున్నారు. రాజకీయ నాయకులు, సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎంతో అవసరం



నిత్యం వాహనాల రద్దీ పెరగడంతో మార్కండేయనగర్ నుంచి బాబుల్‌రెడ్డినగర్ ప్రాంత వాసులు రోడ్డు దాడం కష్టంగా మారింది. అనేక మార్లు ప్రమాదాలు జరిగాయి. అయిన అధికారులు స్పందించడంలేదు. ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రమాదాలు నివారించవచ్చు. అధికారులు ఈ సమస్యను గుర్తించాలని కోరుకుంటున్నాను. –పర్వ సత్యనారాయణ–స్థానికులు

ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి



రోడ్డుపై నిత్యం వాహనాల రద్దీ పెరుగుతున్నది. ప్రజలు రోడ్డు దాటాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు ఉన్నత అధికారులకు వినతి పత్రం అందజేయడం ద్వారా సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుంది. –ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహగౌడ్

ప్రతి ఇంటికీ నీటి సరఫరా

బండ్లగూడ: ప్రజల నీటి కష్టాలను తీర్చేందుకు నూతన రిజర్వాయర్లు నిర్మించి ప్రతి ఇంటికి నీరు సరఫరా చేస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట వద్ద నూతనంగా నిర్మించిన రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా ట్రాయల్‌ను గురువారం నిర్వహించారు. జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డితో కలిసి ప్రతి ఇంటింటికి వెళ్లి నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట దగ్గర నూతనంగా 10 లక్షల లీటర్ల వాటర్ రిజర్వాయర్‌ను నిర్మించడం జరిగిందన్నారు. ఈ రిజర్వాయర్ నుంచి వీరభద్ర కాలనీ, సరస్వతీ కాలనీ, ఆదర్శనగర్, డిడి కాలనీ, వినాయక్‌నగర్, యాదవమిత్ర తదితర ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. ప్రజలు నీటిని వృధా చేయవద్దని, అవసరాలను బట్టి వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేష్‌గౌడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ నారాయణ, జనరల్ మేనేజర్ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్లమయ్య, ప్రశాంత్, జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నీటి ట్రాయల్‌ను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్, జలమండలి అధికారులు

క్రికెట్ పోటీలు.. విజేతలకు బహుమతులు



ట్రోఫీ, మెడళ్లతో గెలుపొందిన విద్యార్థులు, నిర్వాహకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం మైదానంలో స్వామి వివేకనంద జయంతి సందర్భంగా బుధవారం ప్రారంభమైన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి రాంరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల శివరాంపల్లి విజేతగా, ఆదర్శ విద్యాలయం విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. వీరికి కప్‌తో పాటు బీజేపీ అధ్యక్షులు జి. బాబురావు విన్నర్ టీమ్‌కు రూ.1500లు, రన్నరఫ్ టీమ్‌కు రూ.1000లు ప్రైజ్‌ను అందజేశారు. అదే విధంగా ఎంఈఓ రాంరెడ్డి విన్నర్ టీమ్‌కు రూ.1000, రన్నర్ టీమ్‌కు రూ.1000లకు అందజేసి విద్యార్థులను ప్రోత్సాహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం. కొమురయ్య, జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, వై. హరగోపాల్, డివిజన్ ప్రధాన కార్యదర్శి పి. నందీప్ ముదిరాజ్, పి. రవీందర్, ధీరజ్ యాదవ్, ఆదర్శ విద్యాలయ ప్రధాన కార్యదర్శి ఉపాధ్యాయులు శ్రావణ్ కుమార్, పీఈటీలు రాంబాబు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖామంత్రి, రంగారెడ్డిజిల్లా ఇన్‌చార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మంత్రికి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా మంత్రి పర్యవేక్షణలో నిధులు మంజూరు చేస్తారని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జీలను సమన్వయ పరుస్తూ ముందుకు సాగుతామని మంత్రి పేర్కొన్నారని ఆయన వివరించారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో ఉన్న మోడల్ స్కూలులో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ విష్ణుప్రియ తెలిపారు. ఈ నెల 12 నుంచి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆరవ తరగతిలో 100 సీట్లు, మిగతా తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు రుణాలను అందజేశారు. నాబార్డు నుంచి రూ.కోటి 43 లక్షల దీర్ఘ కాలిక రుణాలను గురువారం చైర్మన్ బి. సతీష్ పంపిణీ చేశారు. రైతులు తీసుకున్న పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలను వాయిదా ప్రకారం చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాడలని అన్నారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన మమత

శంషాబాద్ రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన బహదూర్‌గూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌గూడ శివారులోని కేఎల్ఆర్ అక్బర్ ఫాంలో కె. లక్ష్మీనారాయణ, మమత దంపతులు నివాసముంటున్నారు. ఈ నెల 10న లక్ష్మీనారాయణ పని నిమిత్తం తుక్కుగూడ వెళ్లి సాయంత్రం వచ్చాడు. తిరిగి వచ్చేటప్పటికి అతని భార్య మమత ఇంట్లో కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన భాస్కర్

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్‌తండాకు చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండా వాసి సభావత్ భాస్కర్ కు మతిస్థిమితం లేదు. ఇతను 2023 నవంబరు 27న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం ఏర్పాటు చేసిన హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి తేజస్విని నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో ప్రత్యేక జ్యువెలరీ, పండుగ సందర్భంగా వివిధ రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ తదితరులు పాల్గొన్నారు.

భూముల కేటాయింపు ప్రతిపాదనను విరమించుకోవాలి

- కొనసాగుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఆందోళన
- రోడ్డుపైన వంటా వార్పు, ప్రధాన ద్వారం వరకు ర్యాలీ





ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలకు చెందిన 100 ఎకరాల భూములను హైకోర్టు భవన నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 55 ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు నాల్గో రోజు తరగతులు బహిష్కరించి విశ్వవిద్యాలయంలోని జయశంకర్ విగ్రహం ఎదుట ధర్నా, వంటా వార్పు నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే జీఓను రద్దు చేయాలని నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలనుంచి సేకరించిన అమూల్యమైన మొక్కలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. వర్సిటీ భూముల కేటాయింపుతో వాటిని పూర్తిగా తొలగించాల్సివస్తుందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఎన్నో రోజుల పాటు రోడ్లపై బైటాయించి ఆందోళన చేపట్టామని, వర్సిటీ భూముల కాపాడుకునేందుకు మళ్లీ అదే తరహాలో ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అవసరమైతే అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థులతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అక్కడి నుంచి ప్రధాన ద్వారం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఎలాంటి తప్పులకు ఆస్కారం లేదు



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఉప కమిషనర్ రవి కుమార్, నరేందర్ ముదిరాజ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక డేటా ఎంట్రీ సెంటర్లలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పరిశీలించారు. అనంతరం ఉప కమిషనర్ రవి కుమార్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... దరఖాస్తు ఫారాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీని పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎలాంటి తప్పుడు ఉన్న సంబంధిత ఫోన్ నంబర్‌లో వారిని స్వయంగా సంప్రదించి పూర్తి వివరాలను సేకరించి పూర్తి చేయాలన్నారు. ఇదే విషయాన్ని ఉప కమిషనర్‌తో పాటు డేటా ఎంట్రీ సిబ్బందికి వివరించినట్లు వెల్లడించారు. తద్వారా ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండదని తెలిపారు. అధికారులు, సిబ్బంది నూటికి నూరు శాతం పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు.

యువశక్తితోనే దేశాభివృద్ధి



పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

శంషాబాద్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. వివేకానంద వేషధారణతో చిన్నారులు ర్యాలీలో పాల్గొన్నారు. యువశక్తియే దేశానికి ప్రధానమని స్వామి వివేనాంద సూచించాడని ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. సమాజసేవలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమైందని వివేకానంద బోధించారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయిబాబా, ప్రదీప్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు తృప్తినిస్తాయి



అన్నదానం చేస్తున్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

మణికొండ: మనకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి ఇస్తే ఎంతో సంతృప్తి కలుగుతుందని, అందుకే తమ సంస్థ సభ్యులు సేవా కార్యక్రమాలను విరివిగా చేపడతామని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. గురువారం తమ అసోసియేషన్ కార్యాలయం వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తు దారులకు న్యాయం చేయండి



నార్సింగిలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న నరేందర్

మణికొండ: ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న పేదలకు న్యాయం జరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని మణికొండ మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన నార్సింగి, శంషాబాద్ మున్సిపల్ కార్యాలయాలు, రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయాల్లో కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అలాంటి వారి దరఖాస్తులను మానవతావాదంతో పరిశీలించి ఏమైనా తప్పులు ఉంటే వాటిపై ఉన్న ఫోన్ నెంబర్‌ల ఆధారంగా వారిని మరోసారి విచారించి సంపూర్ణ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించామన్నారు. పేద ప్రజలకు అవసరమైన అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకు అధికారులు తమ వంతు సహాకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ బి. సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, డి. కిరణ్‌కుమార్, కౌన్సిలర్‌లు దుర్గేష్ యాదవ్, కె. లక్ష్మీనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు రాము, డి.లక్ష్మన్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శబరిమల యాత్ర



అయ్యప్ప స్వాములకు వీడ్కోలు పలుకుతున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి ఇరుమడితో అయ్యప్ప స్వాములు శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరిన అయ్యప్ప స్వాములకు ఘనంగా వీడ్కోలు పలికారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు జి. బాబురావు వారి బృందం 7 మంది స్వాములకు వీడ్కోలు పలికేందుకు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం. కొమరయ్య, రాష్ట్ర యువ మోర్చా నాయకుడు బొక్క బాల్‌రెడ్డి, ఎం. ధీరజ్ యాదవ్, వి. దయాకర్, ఇ. వేణుగోపాల్, కె. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మాలాధారణ చేసి 41 రోజుల పాటు పూజలు చేసిన భక్తులు శబరియాత్రలో భక్తి శ్రద్ధతో స్వామి వారికి మొక్కులు చెల్లించుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, గురుస్వాములు రాజేందర్ గౌడ్, భాస్కర్‌రెడ్డిలు అన్నారు. గురువారం మణికొండ క్వార్టర్స్ సన్నిదానం స్వాములు ఇరుముడులు కట్టుకుని శబరిమలకు బయలుదేరారు. వారి యాత్ర సంతోషంగా సాగి మొక్కులు చెల్లించుకుని తిరిగి ఇంటికి రావాలని వారు ఆకాంక్షించారు.



శబరిమలకు వెళ్లనున్న స్వాములు